ఐజేయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రవీందర్‌రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 20 : తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయూ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కూకట్‌పల్లి నియోజకవర్గం సీనియర్ జర్నలిస్ట్ మామిడాల రవీందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా ఎన్నికల అధికారి బాలాబోయిన విజయ్‌కుమార్ ఓప్రకటనలో తెలిపారు. శనివారం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన రవీందర్‌రెడ్డికి మేడ్చల్ జిల్లా కమిటీ, కూకట్‌పల్లి నియోజకవర్గం కమిటీ సభ్యులు, పలువురు జర్నలిస్టులు అభినందనలు తెలిపారు.

శరత్‌సిటీ మాల్‌లో ఇండియన్ పెన్ షో

కొండాపూర్, జనవరి 20: కలం చరిత్రను అందరికీ తెలిసేలా, విభిన్న రకాల కలాలను ఒకేచోట ప్రదర్శనలో ఉంచుతూ వినూత్నరీతిలో నేషనల్ హ్యాండ్‌రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో 'ఇండియన్ పెన్ షో-2024'ను శనివారం కొండాపూర్‌లోని శరత్‌సిటీ క్యాపిటల్ మాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కళాకారుడు పి.సీతారామరాజు ముఖ్యఅతిథిగా హాజరై పెన్‌షోను ప్రారంభించా రు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యాండ్‌రైటింగ్ అకాడమీ ప్రతినిధి మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తారమ్మ జాతరను ఘనంగా జరపాలి

- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి
- జాతర ఏర్పాట్లపై అధికారులతో ఎమ్మెల్యే వివేకానంద్ సమీక్ష

చిత్తారమ్మదేవికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

దుండిగల్/కుత్బుల్లాపూర్, జనవరి 20: తెలంగాణలో అత్యంత వైభవంగా జరిగే జాతరల్లో ఒక్కటిగా గాజులరామారం చిత్తారమ్మ దేవి జాతర వేడుకలని,ఈ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులను ఆదేశించారు. శనివారం చిత్తారమ్మ దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతోపాటు ఆయా శాఖల అధికారులతో జరిగిన సమీక్షలో జాతర ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్, గాజులరామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, బాలానగర్ డీసీపీ ఎస్.శ్రీనివాసులు, పాక్స్ డైరెక్టర్ పరిశె శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు విజయరాంరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమే ధ్యేయం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తగు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం పేట్ బషీరాబాద్‌లోని తన నివాసంలో సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు, పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఎన్నికల దృష్ట్యా పూర్తికాకుండా మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులను ఆదేశించారు.

కేటీఆర్‌ను కలిసిన కార్పొరేటర్లు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మియాపూర్, హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాస్‌రావు, సహచర కార్పొరేటర్లు మందాడి శ్రీనివాస్‌రావు, రవీందర్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని కేటీఆర్ సూచించినట్లు వారు పేర్కొన్నారు. – మియాపూర్, జనవరి 20

ప్రగతినగర్‌లో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తదితరులు

నిజాంపేట్‌లో ఎమ్మెల్యే కేపీ కృతజ్ఞత యాత్ర

దుండిగల్, జనవరి 20:నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ 4వ వార్డులో శనివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తన 9వ రోజు 'కృతజ్ఞత యాత్ర'ను చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, కాలనీవాసులు ఎమ్మెల్యేను సన్మానించి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. గత తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి గుర్తుంచుకొని, తర్వాత ఐదేళ్లలో చేపట్టే అభివృద్ధిని ఆశించి మీలో ఒకడిగా, మీ ప్రజాప్రతినిధిగా ఎన్నుకొని ఇంతటి అఖండ విజయాన్ని అందించినందుకు ప్రజలకు ఎమ్మెల్యే కేపీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, డిప్యూటి మేయర్ ధనరాజ్‌యాదవ్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆయా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : గాంధీ

విద్యార్థిని సుదీక్షను అభినందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కాలనీవాసులు, పార్టీ శ్రేణులు

మియాపూర్, జనవరి 20: ప్రతిభ ముందు ఏ ఆటంకమైనా నిలువదని, విజయం వరిస్తుందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. సాధించాలన్న తపన తగు ప్రణాళిక, క్రమశిక్షణతో ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. చందానగర్ డివిజన్ విశ్వేశ్వర కాలనీకి చెందిన భాస్కర్‌రావు, మాధవి లతల కుమార్తె సాయి సుదీక్ష జేఎన్‌టీయూలో బీటెక్‌లో ఉత్తమ ప్రతిభతో పూర్తి చేసుకున్నందున ఎమ్మెల్యే గాంధీ విద్యార్థినిని శనివారం తన నివాసంలో సన్మానించి, విద్యార్థిని అందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. తగు ప్రణాళికతో ముందుకు సాగి ఉత్తమ ప్రతిభను కనబర్చి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థులకు తన చేయూత ఉంటుందని గాంధీ భరోసాఇచ్చారు.

- నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలు కాలనీలకు చెందిన పార్టీ నేతలు, సంఘాలు ఎమ్మెల్యే గాంధీని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆఫీస్ స్పేస్‌కు ఆదరణ

ఆఫీస్ స్పేస్ ప్రొవైడర్‌లో మేటిగా నిలుస్తున్న ఐస్ప్రౌట్ హైదరాబాద్ నగరంలోని నాలెడ్జ్ సిటీలో శనివారం తమ 17వ కార్యాలయాన్ని ప్రారంభించింది. ఐదు అంతస్తుల్లో 4వేల సీట్లను అందిస్తున్నట్లు ఐస్ప్రౌట్ వ్యవస్థాపకురాలు సుందరి పాటిబండ్ల తెలిపారు. ఐటీ రంగానికి కేరాఫ్‌గా నిలుస్తున్న హైదరాబాద్ నగరంలో ఆఫీస్ స్పేస్‌కు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. – కొండాపూర్, జనవరి 20

ఆకట్టుకున్న సంగీత కచేరి

మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా సంగీత కచేరి ఆద్యాంతం ఆకట్టుకున్నది. ప్రముఖ వీణ గురువులు రాయప్రోలు సుధాకర్ తన శిష్య బృందంతో కలిసి వీణా కచేరితో ఆద్యాంతం అలరించారు. – కొండాపూర్, జనవరి 20

చిన్నారులు నృత్య ప్రదర్శనలతో సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో శనివారం పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో నృత్య కార్యక్రమాలు నిర్వహించి, శాలువా కప్పి సత్కరించారు. వేంకటేశ్వరస్వామి మంగళ హారతి అందజేసి ప్రసాద వితరణ చేశారు. – మాదాపూర్, జనవరి 20

రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి

దుండిగల్, జనవరి 20 : విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని మేడ్చల్ జోన్ ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నిజాంపేట్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. సెల్‌ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేయడం, రోడ్డు దాటడం ప్రమాదకరమన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారే వాహనాలు నడుపాలన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ వెంకట్రావు, మియాపూర్ ట్రాఫిక్ సీఐ కిరణ్, ఎస్ఐ మల్లేశ్వర్, పీసీ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి భట్టికి సన్మానం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శనివారం కాంగ్రెస్ నేతలు కోరారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఓబీసీ కోఆర్డినేటర్ భరత్‌గౌడ్, సంపత్, జలీల్‌ఖాన్, సమీర్‌ఖాన్ పాల్గొన్నారు. – జగద్గిరిగుట్ట, జనవరి 20

జాతరకు రావాలంటూ ఎమ్మెల్సీ రాజుకు ఆహ్వానం

ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు బొరంపేట్‌లో నిర్వహించనున్న రేణుకాఎల్లమ్మదేవి కల్యాణం, ఛ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణం, జాతరకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరుతూ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆలయ కమిటీ సభ్యులు శనివారం వేర్వేరుగా కలిసి ఆహ్వానపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నర్సారెడ్డిశ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మురళీయాదవ్, బల్వంత్‌రెడ్డి, యాదగిరి, నాగరాజు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. – దుండిగల్, జనవరి 20

ముగిసిన జాతీయ సమైక్యతా శిబిరం

కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ, జాతీయ సేవా పథకం హైదరాబాద్ రీజినల్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీలో వారం రోజులపాటు జరిగిన జాతీయ సమైక్యతా శిబిరం శనివారంతో ముగిసింది. ముగింపు వేడుకల్లో ఎంఎల్ఆర్ఐటీ చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే, కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఏపీ స్టేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డా.పి.అశోక్‌రెడ్డి, రీజినల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ, ఎంఎల్ఆర్ఐటీ ప్రిన్సిపాల్ డా.కే.శ్రీనివాస్‌రావు హాజరయ్యారు. – దుండిగల్, జనవరి 20

యువకుడి ఆత్మహత్య

కొండాపూర్, జనవరి 20: మద్యానికి బానిసైన యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లి పాపిరెడ్డి కాలనీ సందయ్యనగర్‌కు చెందిన సతీశ్(24), డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. గత నెలరోజులుగా పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తా..

- కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్

బాలానగర్, జనవరి 20: ఫతేనగర్ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని డివిజన్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని నేతాజీకాలనీ, పైప్‌లైన్ రోడ్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. రూ.3 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కావడం వలన స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈ పవన్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వరాల స్వామి, కార్యదర్శి వెంకట నర్సయ్య, శేఖర్‌గౌడ్, కంచి స్వామి, సోమేశ్, కరుణాకర్, స్థానికులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

అల్లాపూర్, జనవరి 20 : అయోధ్య రామ మందిరంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా కబీర్‌నగర్ శ్రీశివ రామాంజనేయ దేవాలయంతోపాటు వివిధ ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శివరామాంజనేయ ఆలయంలో, రామారావునగర్ హనుమాన్ ఆలయంలో అభిషేకాలు, పంచామృతాభిషేకం, సీతారాముల కల్యాణం, అష్టోత్తర నామార్చన, దీపోత్సవాలు, భజన, భక్తికీర్తనలు అనంతరం మధ్యాహ్నం 1 గంటకు అన్నప్రసాదం వితరణ, సాయంత్రం మోతీనగర్ నుంచి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు వెల్లడించారు.

తల్లీకూతుళ్లు అదృశ్యం

దుండిగల్, జనవరి 20: పనిలోకి వెళ్లిన వివాహిత కుమార్తెతో సహా కనిపించకుండా పోయింది. సూరారం పోలీసుల కథనం ప్రకారం.. సాయిబాబానగర్‌లో నివాసముండే అజయ్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తాడు. అతని భార్య శృతి(26) వంట పనితో పాటు కేర్‌టేకర్‌గా పని చేస్తున్నది. కుమార్తె రిషక(3)ను తీసుకుని పనిలోకి వెళ్లి శుక్రవారం తిరిగి రాలేదు. ఆమె ఫోన్ స్విచ్‌ఆఫ్‌గా ఉండటంతో గాలించినా ఆచూకీ దొరకలేదు.భర్త ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గోదాం పరిశీలన

దుండిగల్, జనవరి 20 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గండిమైసమ్మ-దుండిగల్ మండలం, బొరంపేట్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) లిమిటెడ్‌ను హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య, సీఈవో భాస్కర సుబ్రమణ్యం శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం కార్యాలయం,గోదాములను పరిశీలించారు. అదే విధంగా సంఘం పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బొరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నల్తూరి కృష్ణ, కార్యదర్శి సయ్యద్ అసదుల్లాతో పాటు పలువురు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మిద్దెల బాల్‌రెడ్డి, సత్తయ్య, భాస్కర సుబ్రమణ్యంలను శాలువాలతో సత్కరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

దుండిగల్, జనవరి 20: కుల వివక్షత వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం బాచుపల్లి సీఐ జె.ఉపేందర్ చేతుల మీదుగా సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లిఖార్జున్, రఘు పాల్గొన్నారు.

నిర్మాణ వ్యర్థాలు అక్రమ డంప్ చేస్తే వాహనాలుల సీజ్

- జడ్సీ స్నేహ శబరీష్

జడ్సీ స్నేహ శబరీష్

మియాపూర్, జనవరి 20 : నిర్మాణ వ్యర్థాలను అక్రమంగా డంప్ చేసే వాహనాలను సీజ్ చేస్తామని శేరిలింగంపల్లి జడ్సీ స్నేహ శబరీష్ హెచ్చరించారు. వ్యర్థాలను వేసేందుకు జోన్ పరిధిలోని గౌలిదొడ్డి, హైటెక్ సిటీ ప్లైఓవర్ ప్రాంతాలను గుర్తించినట్లు, భిన్నంగా వ్యవహరించే వారిని ఉపేక్షించబోమన్నారు.

శనివారం జడ్సీ మాట్లాడుతూ.. వ్యర్థాల నిర్వహణపై జోన్ స్థాయిలో కమిటీలను సైతం నియమించనున్నట్లు, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టి నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా నిర్మాణ వ్యర్థాలను డంప్ చేసే వారికి మొదటిగా రూ.25 వేలు, రెండోదఫా రూ.50 వేల జరిమానా విధిస్తామని, మూడోసారి రూ.లక్ష జరిమానాతోపాటు వాహనాన్ని సీజ్ చేస్తామని జడ్సీ స్పష్టం చేశారు. వీటిపై ఫిర్యాదులకు 1800120 1159 టోల్ ఫ్రీనంబర్, వాట్సాప్ 9100927073, మై జీహెచ్ఎంసీ యాప్ (www.ghmc.gov.in, http://www.ghmc.gov.in) ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని జడ్సీ స్నేహ శబరీష్ వెల్లడించారు. అక్రమ డంప్‌లను పూర్తిస్థాయిలో నివారించేందుకు అవగాహన కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నామన్నారు.

కులగణనపై జాతీయ సదస్సు

కొండాపూర్, జనవరి 20 : ఇల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కులగణన అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ద్రావిడ కజగం అధ్యక్షుడు డాక్టర్ కే వీరమణి, విద్యావేత్త, ఆర్థికవేత్త శ్యామ్ పెట్రోడ్, రాజ్యసభ సభ్యులు పీ విల్సన్, ప్రొఫెసర్ వెంకటేశ్, ఆళ్ల రామకృష్ణ పాల్గొని కులగణన ప్రాముఖ్యతను వివరించారు. కేవలం రిజర్వేషన్లను పెంచడానికి కాకుండా సామాజిక న్యాయానికి సమగ్ర ఆర్థిక అభివృద్ధికి, అనగారిన వర్గాలకు

కులగణన సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు తోడ్పడేలా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దుండిగల్, జనవరి 20: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలతో పాటు మున్సిపాలిటీలోని వివిధ వార్డులకు చెందిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు శనివారం ఆయన కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.

బియ్యపు గింజలపై రామ అష్టకాలు

చందానగర్‌కు చెందిన రామ భక్తులు విష్ణు వందన శ్రీరామచంద్ర మూర్తి అష్టకాన్ని సూక్ష్మకళ రూపంలో బియ్యపు గింజలపై లిఖించారు. 130 బియ్యపు గింజలపై 90 నిమిషాలలో శ్రీరామ జయ రామ పదాలతో కూడిన రామ అష్టకాన్ని లిఖించినట్లు ఆమె తెలిపారు. రామ అష్టకంతో కూడిన బియ్యపు గింజలను సీతారాముల కల్యాణానికి తలంబ్రాలుగా అందించనున్నట్లు తెలిపారు. – కొండాపూర్, జనవరి 20

ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు

నూతనంగా నియామకమైన ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కొంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు దేవేందర్, ప్రశాంత్‌గౌడ్‌తోపాటు శివకుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.
– కుత్బుల్లాపూర్, జనవరి 20

యువకుడి ఆత్మహత్య

కొండాపూర్, జనవరి 20: మద్యానికి బానిసైన యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లి పాపిరెడ్డి కాలనీ సందయ్యనగర్‌కు చెందిన సతీశ్(24), డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. గత నెలరోజులుగా పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓటరు నమోదుకు చివరి అవకాశం

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 20: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేయాలంటే అర్హులైన వారంతా ఓటరుగా పేరును నమోదు చేసుకునేందుకు చివరి అవకాశమని కూకట్‌పల్లి నియోజకవర్గం ఈఆర్‌వో, డీసీ రమేశ్ తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం నియోజకవర్గం పరిధిలో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారదర్శకమైన ఓటరు జాబితే లక్ష్యంగా ఓటరు జాబితాను ప్రక్షాళన చేస్తున్నట్లు తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులుంటే ఈనెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ప్రచురించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఆర్‌వో శ్రీనివాస్‌రావు, సిబ్బంది ఉన్నారు.

మోటార్ వెహికల్ యాక్ట్‌ను ఉపసంహరించుకోవాలి

జీడిమెట్ల, జనవరి 20 : డ్రైవర్లకు వ్యతిరేకంగా తీసుకవచ్చిన మోటార్ వెహికల్ యాక్ట్-2024 చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ అన్నారు. శనివారం షాపూర్‌నగర్ పోట్లూరి నాగేశ్వరరావు భవన్‌లో నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్ అధ్యక్షతన కుత్బుల్లాపూర్ మండలం ఆటో యూనియన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే 11 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడి గా రాజ్‌కుమార్, కార్యదర్శిగా ఎల్లస్వామి, కోశాధికారిగా కుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

దుండిగల్, జనవరి 20 : మున్సిపాలిటీ పరిధిలోని భవన యజమానులు సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కె.సత్యనారాయణ అన్నారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన ఆస్తిపన్ను వసూలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్తి పన్ను వసూలులో బిల్ కలెక్టర్లు క్రియాశీలకంగా పని చేయాలన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండే విధుల్లో ఉండాలని, మొండి బకాయిదారుల నుంచి పన్ను వసూలు చేసేలా పనిచేయాలన్నారు. లేనిపక్షంలో రెడ్‌నోటీసులు అందజేసి ఆస్తులను జప్తు చేయాలన్నారు. అదే విధంగా వ్యాపారుల నుంచి ట్రేడ్ లైసెన్సు పన్నులను వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి సునందతో పాటు పలువురు బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

- మున్సిపాలిటీ పరిధిలో 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేయించుకోవాలని కమిషనర్ సత్యనారాయణ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లి, దుండిగల్ వార్డుల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. దరఖాస్తులను మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా వార్డు బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.